క్లుప్తంగా

మావుళ్లమ్మకు 10 కాసుల ఆభరణం సమర్పణ


హారాన్ని చూపిస్తున్న ధర్మకర్తలు

భీమవరం (ప్రకాశంచౌక్): విశాఖపట్టణానికి చెందిన భక్తుడు భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మకుఏ 10 కాసుల బంగారం (లక్ష్మీదేవి కంఠహారం) సమర్పించారు. వారికి ఆలయ సిబ్బంది ప్రత్యేక పూజలు చేసి, అమ్మవారి ప్రసాదం, రసీదు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ, సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ, సూపరింటెండెంట్ బాబూరావు, ప్రధానర్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ, ధర్మకర్తలు ముత్యాల రామారావు, తాళ్లపూడి భాగ్యలక్ష్మి, వేద పండితులు రామచంద్ర ఘనాపాటి, ఈఓ దండు కృష్ణంరాజు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

వీరవాసరం: పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుందని డీఈఓ ఆర్.వెంకటరమణ తెలిపారు. మండలంలోని నందమూరి గరువు ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను శుక్రవారం పరిశీలించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులు పారదర్శకంగా, నాణ్యతతో కూడిన విధంగా నిర్వహించాలని సూచించారు. పాఠశాలలోని రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట మండల విద్యాశాఖ అధికారి శ్రీమన్నారాయణ ఉన్నారు

వలంటీర్లకు నియామక పత్రాల అందజేత

ఆకివీడు: కొత్తగా నియమితులైన వలంటీర్లు సేవా భావంతో పనిచేసి మంచి గుర్తింపు పొందాలని ఎంపీడీవో కందుల వాణి తెలిపారు. ఇటీవల జరిగిన ఇంటర్వ్యూల్లో ఉత్తీర్ణులు అయినా ఆరుగురు వలంటీర్లకు శుక్రవారం నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వలంటీరు చిత్త శుద్ధితో పనిచేసినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ భాస్కర్ రాజు పాల్గొన్నారు.

ఆలయానికి ఆర్ఓ ప్లాంట్ అందజేత

పాలకొల్లు సెంట్రల్: స్థానిక చిన్న కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల తాగునీటి సౌకర్యార్థం స్థానిక వాసవి వనిత క్లబ్ సభ్యులు ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను అందించారు. శుక్రవారం ఆలయంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను వనిత క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కొర్లేపర కృష్ణాజి దంపతులు ప్రారంభించారు. అనంతరం ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ జోగి వెంకటేశ్వరరావు కృష్ణాజి దంపతులను స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాస్, ట్రస్ట్ బోర్డు సభ్యులు పెచ్చెట్టి శరత్ చంద్ర, కెల్లా సుబద్ర, క్లబ్ అధ్యక్షురాలు చిదెళ్ల మహాలక్ష్మి, సెక్రటరీ బొండాడ వినయకుమారి, ట్రెజరర్ తోట వారిజాలిల్లి, ఆలయ అర్చకులు కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థి మిస్సింగ్


రామ్‌తేజ

పాలకొల్లు సెంట్రల్: పదో తరగతి ఫెయిల్ అవ్వడంతో శుక్రవారం ఓ విద్యార్థి ఇంటి నుంచి వెళ్లిపోయాడని అతడి తండ్రి పోలీసులను ఆశ్రయించాడు. విద్యార్థి తండ్రి వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక దేశాలమ్మ గుడి వద్ద చింతల తోట ప్రాంతంలో నివాసం ఉంటున్నామని, తమ కుమారుడు రామ్‌తేజ ఇటీవల వెలువడిన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఫెయిల్ అవ్వడంతో సప్లిమెంటరీకి రాసాడు. శుక్రవారం ఉదయం పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాలు వెలువడ్డాయి. మధ్యాహ్నం 12 గంటల వరకూ ఇంటి వద్దే ఉన్న రామ్‌తేజ ఫలితాలు చూసుకుని వస్తానని చెప్పి ఇంటి నుండి బయటకు వెళ్లాడు. మళ్లీ ఫెయిల్ అవ్వడంతో రామ్‌తేజ్ తన తల్లి నాగమణికి ఫోన్ చేసి విషయం చెప్పాడు. సరేలే ఇంటికి వచ్చాకా మాట్లాడదాము రమ్మని తల్లి చెప్పింది. తేజ ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో పట్టణంలో బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించక పోవడం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తూర్పు కాపుల రిజర్వేషన్లపై హద్దులు తొలగించాలి

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో తూర్పుకాపులకు ఓబీసీ రిజర్వేషన్లపై హద్దులు తొలగించి అన్ని జిల్లాలకు వర్తించేలా కృషి చేయాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పవర్‌కు తూర్పుకాపు సంఘ సభ్యులు గురువారం వినతిపత్రం అందజేశారు. శుక్రవారం సంఘ సభ్యులు లోపింటి చిరంజీవి విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్‌సీబీసీ కమిషన్ కోరిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభమైందని విద్యార్థులు ఓబీసీ సర్టిఫికెట్ లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. త్వరితగతిన సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మీసాల రాము, పిల్లా సత్తిబాబు, సామంతుల అప్పారావు, పొట్నూరి రమేష్, చీరా సత్తిబాబు, దేవి కిషోర్, భాకూరి నిరంజన్, ధనాని ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పశు బీమాతో పాడి రైతులకు ధీమా

ఎమ్మెల్యే శ్రీనివాస్


భీమవరంలో పశుబీమా పథకం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్


తాడేరు వంతెన పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: వైఎస్సార్ పశు బీమా పథకం పశు పోషణ పై ఆధారపడ్డ పాడి రైతులకు వెన్నదన్నుగా నిలుస్తుందని ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో వైయస్సార్ పశు బీమా పథకానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి అన్ని వర్గాల ప్రజలకు అనేక విధాలుగా మేలు చేస్తున్నారన్నారు. ప్రధానంగా వ్యవసాయ ఆధారమైన రైతులు ఎక్కువగా పశు పోషణపై దృష్టి పెట్టడంతో పాలకు మంచి ధర లభించే విధంగా కృషి చేయడమేగాక పశువులకు ప్రమాదం జరిగిన సమయంలో పశుబీ మా పథకం ద్వారా రైతులకు లబ్ధిపొందవచ్చునన్నారు. రైతులు తమ పశువులకు సంబంధించి ఒకసారి బీమా ప్రీమియంను చెల్లిస్తే మూడేళ్ల పాటు అమలులో ఉంటుందన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన రైతులు గేదెలు, ఆవులకు సంబంధించి రూ. 200 చెల్లిస్తే పశువులకు ప్రమాదం జరిగిన సమయంలో ప్రభుత్వం రూ. 15 వేలును నష్టపరిహారంగా చెల్లిస్తుందని అలాగే పింక్ కార్డు కలిగిన రైతులు రూ. 400 చెల్లిస్తే రూ. 30 వేలను నష్టపరిహారంగా చెల్లిస్తుందని శ్రీనివాస్ చెప్పారు. పశుబీమా పథకం మేకలు, గొర్రెలు, పందులకు కూడా వర్తిస్తుందని అందువల్ల రైతాంగం ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడి డాక్టర్ పి సుధీర్ బాబు, మండల పశువైద్యుడు పి పుండరీ బాబు తదితరులు పాల్గొన్నారు.

తాడేరు వంతెన పనుల పరిశీలన

పట్టణ శివారు గునుపూడి డ్రయిన్‌పై నిర్మిస్తున్న తాడేరు వంతెన పనులను శుక్రవారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పరిశీలించారు. శిథిలావస్థకు చేరుకున్న వంతెనను తొలగించి రూ.2.30 కోట్లు వ్యయంతో చేపట్టిన వంతెన పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం ర్యాఫ్ట్ ఫౌండేషన్ పనులు జరుగుతున్నాయని నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకుండా పటిష్ఠంగా ఉండాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. వంతెన నిర్మాణ ం జరుగుతున్నందున ఈ రహదారిలో ప్రయాణించే వాహనదారులు పూర్తిగా సహకరించాలని కోరారు. ఆయన వెంట ఆర్అండ్‌బీ ఈఈ ఎస్ లోకేశ్వరరావు, డీఈ రామరాజు, ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహరాజు, శిరిగినీడి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే గ్రంధిని కలిసిన సొసైటీ అధ్యక్షుడు

కాళ్ల: భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాసు ను కోపల్లె సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ వేగేశ్న జయ రామ కృష్ణంరాజు కలిశారు. భీమవరం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే శ్రీనివాసును మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

జగనన్న పాలనలో పారదర్శకంగా పథకాలు


పెదఅమిరంలో సీఎం జగన్ ప్రసంగాన్ని వీక్షిస్తున్న నాయకులు


ఉండి ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం


ఆకివీడులో సీఎం జగన్ ప్రసంగాన్ని వీక్షిస్తున్న నాయకులు, అధికారులు


కొండేపూడిలో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ బొక్కా రాంబాబు

కాళ్ల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రజలకు పథకాలన్నీ పారదర్శకంగా అందుతున్నాయని కోపల్లె సొసైటీ అధ్యక్షుడు వేగేశ్న జయరామకృష్ణంరాజు, పెదఅమీరం గ్రామ సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభోత్సవ కార్యక్రమన్ని పేదఅమిరంలో రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా టీవీ ద్వారా కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు జవ్వాది సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగన్న సురక్ష.

ఉండి: గ్రామంలోని మారుమూల ప్రాంతాల్లో ఉండే సమస్యలను కూడా అధికార యంత్రాంగం ద్వారా గుర్తించి వాటిని పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు. శుక్రవారం ఉండి మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమ ప్రారంభోత్సవాన్ని మండల ప్రత్యేకాధికారి ఎం రవికుమార్ ఆధ్వర్యంలో అధికారులు వీక్షించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో 30 రోజుల పాటు నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమంలో సచివాలయ అధికారులు, వలంటీర్‌లు, సచివాలయ కన్వీనర్‌లు, గృహసారధులు బృందంగా ప్రతీ ఇంటినీ సందర్శించి వారి సమస్యలు అడిగి తెలుసుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏవీ అప్పారావు, ఈవోపీఆర్డీ కే కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ప్రతీ కుటుంబానికీ రక్ష

ఆకివీడు: జగనన్న సురక్ష ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందజేయడమే లక్ష్యంగా పథకాన్ని సీఎం జగన్ శుక్రవారం ప్రారంభించారని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి చెప్పారు. కార్యాలయ ఆవరణలో సీఎం జగన్ పథకాన్ని టీవీలో ప్రారంభిస్తున్న దృశ్యాన్ని తిలకించారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ కుల, మత, పార్టీలకతీతంగా అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందజేయాలన్న ఆశయంతో నూతన పథకాన్ని ప్రారంభించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జీ.కృష్ణమోహన్, త్రిసభ్య కమిటీ చెర్మన్ కేశిరెడ్డి మురళీ, వైస్ చైర్మన్ వంగా జ్యోత్సన, శిరపు శ్రీనివాస్, జామి శ్రీనివాస్, మన్నే పోతరాజు, హుస్సేన్, గోబేరు రమణ, అందే రాజబాబు, ఎండీ. ఆలీ, మోటుపల్లి రాజు, తిప్పా భవానీ, కౌన్సిలర్లు మోటుపల్లి కుమారి, కటికతల జాన్ వెస్లీ, దొడ్డి జగదీష్, తిమ్మారెడ్డి మాధవి, నిమ్మల నాగు, ఎండీ.జక్కీ, గుండుగొలను సావిత్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలకు క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకే జగనన్న సురక్ష పథకం

పాలకోడేరు: ప్రభుత్వ పథకాల అమలు తీరు, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని సర్పంచ్, మాజీ సర్పంచ్‌లు చింతపల్లి వెంకటనారాయణ, బొక్కా రాంబాబు అన్నారు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి జగనన్న సురక్ష పథకం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కొండేపూడి సచివాలయంలో ప్రజాప్రతినిధులు అధికారులు వీక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమం విధి విధానాలు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎస్ మండల కన్వీనర్ పాలా రాధాకృష్ణ, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, అధికారులు వలంటీర్లు పాల్గొన్నారు.

ఆషాఢమాసంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు


లక్ష్మీ వారాహి అలంకరణలో పార్వతీదేవి

ఆకివీడు: ఆషాడ మాసంలో వచ్చే మొదటి శుక్రవారంలో పలు ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆషాడ మాస విశిష్టతను తెలియజేస్తు మహిళలకు తీర్థప్రసాదాలు అందజేశారు. స్థానిక పిల్లలమర్రి అగ్రహారంలో వేంచేసియున్న పార్వతీ సమేత వేంకటలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారిని లక్ష్మీ వారాహిగా అలంకరించి అర్చకులు గూడూరి సుబ్రహ్మణ్యం పూజలు చేశారు. పెద్దింటి అమ్మవారి ఆలయంలోనూ, వనువులమ్మవారి ఆలయంలో, మాదివాడలోని గంగానమ్మ, మద్దిరావమ్మ అమ్మవార్ల ఆలయంలోనూ, గంగానమ్మ, దండు మారెమ్మ, పలు గ్రామాల్లోని ఆలయాల్లో పూజలు చేశారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి


పాలకోడేరు లో డ్రైయిన్ ను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు

పాలకోడేరు: వర్షాకాలం మొదలైంది కాబట్టి వైద్య సిబ్బంది గ్రామాల్లో అప్రమత్తంగా ఉండి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు తగిన అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మహేశ్వరరావు అన్నారు. పాలకోడేరులో డ్రైడే -ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా పరిసరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల ప్రభావం ఎక్కువగా ఉంటుందని, దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా తదితర జ్వరాలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేలా వైద్య సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రంగం నాయుడు, ప్రకృతి వైద్యురాలు డాక్టర్ సుజన, సిహెచ్‌వో సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్ సర్వీసులో ఉచిత శిక్షణ

ఉండి: మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో డ్రోన్ సర్వీసింగ్‌పై 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ శ్రీనివాసరాజు తెలిపారు.ఈ ఉచిత శిక్షణ కొరకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు 10వ తరగతి పాస్ అయ్యి 17 యేళ్ల నుంచి 45 యేళ్లలోపు వయస్సు వారై ఉండాలన్నారు. దరఖాస్తుదారుడు ఆధార్ కార్డు, విద్యార్హత, ఫోటో, ఈమెయిల్, ఫోన్ నంబర్‌తో ఈ నెల 30వ తేదీలోపుగా నేరుగా ఐటీఐకి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కొరకు 9676099988 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి


గొల్లలకోడేరులో నిరసన వ్యక్తం చేస్తున్న అపార్ట్‌మెంట్ వాసులు

పాలకోడేరు: అన్యాయంగా చెట్లను నరికి వేసిన వారిపై వాల్టా చట్టం కింద చర్యలు తీసుకోవాలని గొల్లలకోడేరు శివారు సంజన డవలపర్స్ అపార్ట్‌మెంట్ వాసులు నిరసన వ్యక్తం చేశారు. 2009 లో పంచాయతీ కార్యదర్శి 68 రకాల చెట్లను అపార్ట్‌మెంట్స్ రోడ్ కు ఇరువైపులా నాటారని, అయితే ఆ చెట్లు ఉండడం వల్ల తాను కట్టిన బిల్డింగ్స్ కనిపించడం లేదని అడ్డుగా ఉన్నాయంటూ ఒక రోజు తెల్లవారు ఝామున విచక్షణా రహితంగా సంజనా డెవలపర్స్ అపార్ట్‌మెంట్స్ యజమాని నరికి వేశారని వారు ఆరోపించారు. ఆయనపై వాల్టా చట్టం కింద చర్యలు తీసుకోవాలని నినాదాలు చేస్తూ డిమాండ్ చేశారు. సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శితో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారని తెలిపారు ఈ కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు డి కృష్ణంరాజు, ఎస్ వి రామకృష్ణంరాజు,కె రాఘవేంద్ర రాజు, వి సత్యనారాయణ రాజు, ఆర్ రామలింగ రాజు, వి రంగరాజు, కే రాంబాబు తదితరులు పాల్గొన్నారు

లేసుపార్కులో ఉచిత శిక్షణ తరగతులు

నరసాపురం రూరల్: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం ద్వారా అందించనున్న ఉచిత శిక్షణలను వినియోగించుకోవాలని లేసుపార్కు మేనేజర్ డి.వెంకటేశ్వరరావు, ఎన్ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.వసంతరావు పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ)ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమానికి లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. నరసాపురం మండలం సీతారాంపురం లేసుపార్కులో 60 మంది ఔత్సాహిక మహిళలకు రెండు బ్యాచ్‌లుగా కుట్టు మిషన్, హ్యాండ్ ఎంబ్రాయిడరీలపై శిక్షణను ఇవ్వనున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో లేసు పార్కు అధ్యక్షురాలు పులపర్తి మహాలక్ష్మి, పాలంకి రమేష్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పాలకొల్లు అర్బన్: మండలంలోని వెలివెలలో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల గ్రామానికి చెందిన పిడకల సురేష్ బాబు (24) మృతి చెందాడు. మృతుడు సురేష్‌బాబు ఓ రైతుకి చెందిన రొయ్యల చెరువుపై పనిచేస్తున్నాడు. జనరేటర్ ఆన్ చేస్తుండగా ప్రమాదం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు అన్నయ్య నరేంద్రబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

లారీ ఢీకొట్టడంతో విరిగిన విద్యుత్ స్తంభం


లారీ ఢీకొనడంతో విరిగిపోయి లారీపై పడిన విద్యుత్ స్తంభం

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతం కేదారేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ప్రధాన రహదారి మార్గంలో రావులపాలెం నుంచి పెనుగొండ వైపు అధికలోడుతో వెళుతున్న లారీ రహదారి పక్కనున్న 11కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యుత్ స్తంభం విరిగిపోయి లారీ లోడుపై పడింది. స్థానికులు సకాలంలో స్పందించి విద్యుత్ సిబ్బందికి సమాచారమివ్వడంతో విద్యుత్‌శాఖ సిబ్బంది సరఫరా నిలిపివేశారు. ఈ ప్రమాదంలో అదృష్టవశాత్తూ ఎవరికీ ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రోడ్డుకు అడ్డంగా లారీ నిలిచిపోవడంతో ఇరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయి కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

వైఎస్సార్ బీమా అందజేత


ఏలురుపాడు గ్రామంలో వైఎస్సార్ బీమా అందజేస్తున్న వైసీపీ నాయకులు, అధికారులు

కాళ్ల: వైఎస్సార్ బీమా పథకం ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని ఏలూరుపాడు గ్రామ ఎంపీటీసీ చిన్నాపరపు రాంబాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్‌రాజులు తెలిపారు. ఏలూరుపాడు కొత్తపేట ఏరియాకి చెందిన పాల సుబ్బారావు భార్య పాల మహిమ కుమారి ఈనెల 2 వ తేదీన గుండెపోటుతో మరణించారు. వారికి రాష్ట్ర ప్రభుత్వ వైఎస్సార్ బీమా పథకం ద్వారా లక్ష రూపాయలు మంజూరు కావడంతో ముందుగా 10,000 రూపాయలను శుక్రవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. మిగిలిన 90,000 రూపాయలను వారి యొక్క నామిని ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మంతెన రామకృష్ణరాజు, మండల ఎస్సీ నాయకులు కోనా రంజిత్, సచివాలయం కన్వీనర్ దాట్ల రామభద్రరాజు, పంచాయతీ బోర్డ్ మెంబర్ పోతురాజు జేమ్స్, సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ కళ్యాణ్ తదితులున్నారు.

అదనపు పని భారాన్ని తగ్గించాలి


ఆశ యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న పోసమ్మ

సాక్షి, భీమవరం: ఆశ కార్యకర్తలకు అదనపు పని భారాన్ని తగ్గించాలని ఏపీ వలంటరీ హెల్త్ వర్కర్స్ ఆశ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె పోసమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం భీమవరం సీఐటీయూ కార్యాలయంలో ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చింతపల్లి లక్ష్మి అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. గర్భిణులను ఆసుపత్రికి తీసుకు వెళ్తున్నప్పుడు ప్రసవమయ్యే వరకు అక్కడే ఉండాల్సి వస్తుందని అటువంటి సమయంలో ఇబ్బందులు పడుతున్నామన్నారు. జిల్లా అధికారుల ఆదేశాలనుఅమలు చేయడంలో కింద స్థాయి అధికారులు వక్ర భాష్యాలు చెప్పి మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శి దిగుపాటి జ్యోతి, ఎండీ బేగం, లారెన్స్ కుమారి, ఆదిలక్ష్మి, పద్మ, జానకి తదితరులు పాల్గొన్నారు.

దళితుల పేరుతో రాజకీయాలొద్దు

యలమంచిలి: దళితుల పేరుతో రాజకీయాలు చేయడం తెలుగుదేశం నాయకులకు పరిపాటిగా మారిందని హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు విమర్శించారు. మేడపాడు జగనన్న కాలనీలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చించినాడ పెరుగులంక భూమి పూర్తిగా ప్రభుత్వానికి చెందినదన్నారు. ఆ భూమిలోని తువ్వ ఇసుకను కలెక్టర్ అనుమతితో గృహ నిర్మాణ శాఖ, గనుల శాఖ, రెవెన్యూ శాఖ పర్యవేక్షణలో జగనన్న కాలనీలకు తోలుతుంటే పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు దానిని కూడా రాజకీయం చేయడం సిగ్గు చేటన్నారు. స్థానిక సీపీఎం నాయకులకు అది పూర్తిగా ప్రభుత్వ భూమని తెలిసినా వారు కూడా దళితుల భూమి అంటూ నిరసనలు, దీక్షలు చేయడం గర్హనీయమన్నారు. డీఫామ్ పట్టా భూముల్లో కాయకూరలు, పశుగ్రాసం మాత్రమే సాగు చేయాలన్నారు. కానీ అక్కడ పట్టా భూముల్లో ఆక్వా చెరువులు తవ్వుతుంటే అప్పుడు ఈ సీపీఎం నాయకులంతా ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. పట్టా భూములు అమ్మడం, తనఖా పెట్టడం నేరమని ఈ విషయంలో ఎస్సీ కమిషన్ ఆధ్వర్యంలో ఆ భూములపై విచారణ చేసి, చేతులు మారాయని నిర్ధారణ అయితే పాత పట్టాలను రద్దు చేసి కొత్తగా అర్హులను గుర్తించి వారికి పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని పెద్దిరాజు చెప్పారు. మేడపాడు సొసైటీ అధ్యక్షుడు గుర్రాల వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ, అడవిపాలెం వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బుంగా జయరాజు పాల్గొన్నారు.